క్లుప్తంగా

క్రోసూరులో ఎమ్మెల్యే పర్యటన



క్రోసూరు: మొహర్రం పండుగను పురస్కరించుకుని బుధవారం మండలంలోని దొడ్లేరు గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ క్రోసూరులో పర్యటించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కొద్దిసేపు మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారి వెంట ఉన్న ఆర్ అండ్ బీ బంగ్లాను సందర్శించారు. బంగ్లా శిథిలావస్థకు చేరిన కారణంగా పునర్నిర్మాణం చేపట్టాలని స్థానికులు ఆయన్ను కోరారు. సంబంధిత వివరాలను ఫోనులో అధికారులను అడిగి ఎమ్మెల్యే తెలుసుకున్నారు. పబ్లిక్ టాయిలెట్ల కోసం బంగ్లా స్థలంలో ఓ పక్కన నిర్మాణాలు చేపట్టాలని పలువురు కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఆయన వెంట పార్టీ నాయకులు కంచేటి సాయిబాబు తదితరులు ఉన్నారు.

ఘనంగా ఏకలవ్య జయంతి వేడుకలు



సత్తెనపల్లి: ఏకలవ్య జయంతి వేడుకలు సత్తెనపల్లి మండలం బట్లూరు గ్రామంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏకలవ్య విగ్రహానికి గుంటూరు నగర మాజీ మేయర్ కన్నా నాగరాజు పూల మాలలు వేసి, నమస్కరించారు. స్థానికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు



వెంకట శివ

క్రోసూరు: మండలంలోని అందుకూరు గ్రామానికి చెందిన ఓ యువకుడు అదృశ్యమయ్యారు. ఈ నెల 15వ తేదీ నుంచి అతడు కనిపించడం లేదని తండ్రి పోలీసుస్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు బుధవారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.షఫీ తెలిపారు. గ్రామానికి చెందిన కట్లగుంట వెంకట శివ (25) అదృశ్యమైన సమయంలో ఆకుపచ్చ చొక్కా, జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నారు. 15న ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96235, 08640- 227133 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రతి సోమవారం సచివాలయాల్లో 'పీజీఆర్ఎస్'

మున్సిపల్ కమిషనర్ వెంకట్‌దాస్



మాచర్ల: పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం మున్సిపల్ కార్యాలయం, సచివాలయాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కింద ప్రజలకు సంబంధించిన అర్జీలు స్వీకరించాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్‌దాస్ పేర్కొన్నారు. అలాగే ఆ సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అన్ని విభాగాల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పీజీఆర్ఎస్ పేరుతో వేదిక ఏర్పాటు చేసిందని వెల్లడించారు. సచివాలయ ఉద్యోగులు తమ పరిధిలో ప్రజల సమస్యలపై నివేదిక తయారు చేసి ఆయా విభాగాల హెడ్‌లకు పంపించాలన్నారు. సమస్యలన్నింటినీ 24 గంటల్లోపు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వచ్చే సోమవారం నుంచి కచ్చితంగా అమలు చేయాలన్నారు. మున్సిపల్ కార్యాలయం, సచివాలయాలు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని చెప్పారు. నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయ సిబ్బంది ప్రతి సోమవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు ఉద్యోగులు, అడ్మిన్‌లు సమష్టిగా కృషి చేయాలని సూచించారు.

ఇన్‌చార్జి ఎంఈవోగా శ్రీనివాసరెడ్డి



మాచవరం: మాచవరం మండల ఇన్‌చార్జి విద్యా శాఖాధికారిగా ఎ.శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. జిల్లా ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎంఈవోగా పనిచేసిన బి.రాజకుమారి సెలవుపై వెళ్లడంతో మండలంలోని మోర్జంపాడు జీవీజీకేఆర్వో హైస్కూల్‌లో హెచ్ఎంగా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డిని ఇన్‌చార్జి ఎంఈవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మండలంలో విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి చెప్పారు.

వైభవంగా తొలి ఏకాదశి పూజలు



ప్రత్యేక అలంకరణలో కోళ్లూరి ప్రసన్నాంజనేయస్వామి



అచ్చంపేట హరిహర క్షేత్రంలో అలంకరణలో వేంకటేశ్వర స్వామి



చామర్రులో పూజలు అందుకున్న వినాయకుడు



అలంకరణలో వైకుంఠపురం వెంకటేశ్వరుడు



విశేష అలంకరణలో నర్సింగపాడు కాశీవిశ్వేశ్వర స్వామి వారు



వడ్డవల్లిలో ప్రత్యేక అలంకరణలో శ్రీవారు

బెల్లంకొండ: మండలంలో బుధవారం తొలి ఏకాదశి పర్వదినాన్ని భక్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మండలంలోని బెల్లంకొండ, నాగిరెడ్డిపాలెం, గంగిరెడ్డిపాలెం, చంద్రాజపాలెం, పాపాయపాలెం, వెంకటాయపాలెం, మన్నెసుల్తాన్‌పాలెం తదితర గ్రామాలలో భక్తులు వేకువజామునే పుణ్య స్నానాలను ఆచరించారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. పాడిపంటలు బాగా ఉండాలని దేవతలను వేడుకున్నారు. వెంకటాయపాలెం గ్రామంలోని శ్రీకొండ శింగరేశ్వర స్వామి ఆశ్రమంలో గ్రామ ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలోని కొండపై గంగా పార్వతీ సమేత నాగేశ్వర, గౌతమేశ్వర స్వామికి వివిధ గ్రామాల భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారు కొండపై కొలువుదీరడంతో తొలి ఏకాదశి నాడు మాత్రమే భక్తులు దర్శించుకుంటారు. ఈ సంవత్సరం ఎన్నడూ లేనివిధంగా వేల సంఖ్యలో భక్తులు కొండ పైకి వచ్చారు. దీంతో ఆ ప్రాంతమంతా కిటకిటలాడింది. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ రాజేష్ సిబ్బందితో కలిసి ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

కోళ్లూరి ప్రజన్నాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు......

మండలంలోని బెల్లంకొండ క్రాస్ రోడ్ వద్ద ఉన్న కోళ్లూరి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయానికి తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, ఆకు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు, అనంతాచార్యుల పర్యవేక్షణలో ఈ పూజలు జరిగాయి.

అచ్చంపేట: తొలి ఏకాదశి నేపథ్యంలో హరిహర క్షేత్రంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు చేశారు. ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు. పవిత్ర కృష్ణానది ఒడ్డున చామర్రులో వేంచేసియున్న శ్రీ వినాయకస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. చామర్రు రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు ఉప్పల శ్రీనివాసమూర్తి దంపతులు స్వామి వారికి అభిషేకాలు చేశారు. శ్రీకాశీ అన్నపూర్ణ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అచ్చంపేటలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. లలిత, గాయత్రి దేవిల అష్టోత్తర శతనామార్చనలు చేశారు. దేవాలయాలలో ప్రసాదంగా పేలాల పిండిని పంపిణీ చేశారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి వేడుకలలో పాల్గొన్నారు.

అమరావతి: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన అమరావతి, వైకుంఠపురం దేవాలయాలలో తొలి ఏకాదశి పర్వదినాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో వేడుకలకు హాజరయ్యారు. వేకువజాము నుంచే అమరావతి, తుళ్ళూరు, తాడికొండ మండలాల నుంచి భక్తులు వైకుంఠపురం వేంకటేశ్వరుడిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. క్షేత్రంలో కృష్ణానది ఉత్తర వాహినిలో పుణ్యస్నానాలు ఆచరించారు. కొండపైన వెంకటేశ్వరుడిని దర్శించుకున్నారు. అనంతరం కొండ కింద వేంచేసియున్న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకస్వాములు ఉదయాన్నే స్వామి వారికి పంచామృత స్నపనానంతరం విశేష అలంకరణ చేశారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా స్థానికులు, దేవదాయ శాఖాధికారులు ఏర్పాట్లు చేశారు. పెదకూరపాడుకు చెందిన కోలాట బృందం ప్రదర్శన భక్తులను అలరించింది. తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వైకుంఠపురం వచ్చిన భక్తులకు గ్రామస్తుల సహకారంతో అన్నదానం నిర్వహించారు. ప్రసాదాలు, మజ్జిగను అందజేశారు.

- అమరావతిలో వేంచేసియున్న అమరేశ్వర స్వామిని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని పూజలు నిర్వహించారు. పుణ్యస్నానాలు ఆచరించి స్వామికి అభిషేకాలు చేశారు. అమ్మ వారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.

నకరికల్లు: మండలంలోని పలు గ్రామాల్లో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా పూజలు ఘనంగా నిర్వహించారు. దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన చేజర్ల గ్రామంలోని శ్రీ కపోతేశ్వరస్వామి ఆలయం, మునులచే ప్రతిష్ఠించబడినట్లు చరిత్ర గల నర్సింగపాడు గ్రామంలోని శ్రీ అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం, మరకతలింగ చంద్ర మౌళీశ్వర స్వామి ఆలయం సహా దేవవరం, చల్లగుండ్ల, గుండ్లపల్లి, చీమలమర్రి తదితర గ్రామాల్లోని శివాలయాల్లో విశేష పూజలు చేశారు. ఆయా ఆలయాల అర్చకుల ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. అమ్మ వారు, స్వామి వారిని విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పొంగళ్లు పొంగించి, మొక్కులు చెల్లించారు.

సత్తెనపల్లి: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు బుధవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు పోటెత్తారు. పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో పూజలు నిర్వహించారు. గోత్రనామాలతో అభిషేకాలు చేశారు. బొడ్డువల్లి శ్రీ రామాలయం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో, రైల్వే స్టేషన్ రోడ్డులోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం సహా వివిధ అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

ముప్పాళ్ళ మండలంలో..

ముప్పాళ్ళ: మండలంలోని గ్రామాల్లో తొలి ఏకాదశి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మండల కేంద్రమైన ముప్పాళ్ళలోని శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, మాదలలోని శ్రీ సాగరేశ్వర స్వామి ఆలయం, నార్నెపాడులోని శ్రీ శంభు లింగేశ్వరస్వామి ఆలయాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం వారికి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



సత్తెనపల్లి రైల్వేస్టేషన్ రోడ్‌లోని ఆలయంలో అలంకరణలో వెంకటేశ్వర స్వామి వారు



పెదకూరపాడు కోదండ రామాలయంలో పూజలు



వైకుంఠపురం కొండ మెట్ల మార్గంలో భక్తులు



బెల్లంకొండలోని కొండపై భక్తుల సందడి

భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆయా ఆలయాల కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పెదకూరపాడు: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలవ్యాప్తంగా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. పెదకూరపాడులోని కోదండరామాలయంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి శివాలయం, ఆంజనేయస్వామి దేవాలయం, 75 త్యాళ్లూరులోని రామాలయం, శివాలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహించారు.

రాజుపాలెం: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలో విశేష పూజలు నిర్వహించారు. స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామంలోని భక్తులు అధికసంఖ్యలో దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

వెంకట్రావు సేవలు చిరస్మరణీయం



పెదకూరపాడు: పేదల కోసం తన సొంత నిధులను వెచ్చించిన మహోన్నత వ్యక్తి నెలకుదిటి వెంకట్రావు అని జీడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్, మాజీ ఎంపీపీ నెలకుదిటి వీరవెంకట వరప్రసాద్ (బుజ్జి) అన్నారు. పెదకూరపాడులోని పంచాయతీ కార్యాలయం వద్ద వెంకట్రావు వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ.. తన తండ్రి ఆశయాలను నెరవేర్చేందుకు కృషి చేస్తానన్నారు. క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బెల్లంకొండ రామగోపాలరావు మాట్లాడుతూ పేదలకు అండగా ఉంటూ సేవలు చేసిన వెంకట్రావు చిరస్మరణీయులు అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జి.బాబూరావు, 75 త్యాళ్లూరు సొసైటీ మాజీ అధ్యక్షుడు శివరామకృష్ణయ్య, ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఎస్సీ సెల్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

వందేళ్ల వేప చెట్టుపై గొడ్డలి వేటు



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని తాలూకా సెంటర్‌లో వందేళ్ల నాటి వేప చెట్టుపై గొడ్డలి వేటు పడింది. రంపాలతో ముక్కలుగా చేశారు. ఇక్కడ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్ పునరుద్ధరణకు చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగా దానికి అడ్డొస్తుందేమోననే ఉద్దేశంతో వేప చెట్టును నరికివేశారు. ప్రధాన రహదారి నిర్మాణం సమయంలో కూడా ఈ చెట్టు జోలికి ఎవరు వెళ్లలేదు. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసేటప్పుడూ చెట్టు అడ్డంకి కాలేదు. కానీ ప్రస్తుతం చెట్టు మొత్తం నరికేసి మోడు మిగిల్చారు. గతంలో చెట్టు కింద చిరు వ్యాపారులు తోపుడు బండ్లు పెట్టుకునేవారు. ఎవరైనా తమ డిమాండ్ల పరిష్కారం కోసం శాంతియుత దీక్షలు, ధర్నాలు ఇక్కడే నిర్వహించేవారు. సాయంత్రం సమయంలో స్థానికులు ఆ ప్రాంతంలో సేద తీరేవారు. చెట్టును నరకడాన్ని ప్రతి ఒక్కరు జీర్ణించుకోలేక పోతున్నారు. బాధ్యులపై వాల్టా చట్టం కింద కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు పర్యావరణ ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు.

ఘనంగా మొహర్రం వేడుకలు



దొడ్లేరులో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు



వేడుకలో ఎమ్మెల్యే ప్రవీణ్ తదితరులు



అగ్నిగుండంలో నడిచేందుకు సిద్ధంగా ముజావర్లు

బెల్లంకొండ: మండలంలోని పలు గ్రామాలలో బుధవారం మొహర్రం పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. పాపాయపాలెం, బెల్లంకొండ, వన్నాయపాలెం, న్యూచిట్యాల, వెంకటాయపాలెం గ్రామాలలో పీర్లను గ్రామ పురవీధులలో ఊరేగించారు. మండల కేంద్రమైన బెల్లంకొండలో బుధవారం సాయంత్రం పీర్లను వైభవంగా ఊరేగించారు. కులమతాలకు అతీతంగా గ్రామాలలో మేళతాళాల నడుమ కార్యక్రమం నిర్వహించారు. యువకులు వివిధ వేషధారణలతో ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొన్నారు. మతపెద్దలు మాట్లాడుతూ ముస్లింల త్యాగాలకు ప్రతీకగా మొహర్రం పండుగను నిర్వహిస్తారని గుర్తుచేశారు.

దొడ్లేరు(క్రోసూరు): మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం పండుగను పలు గ్రామాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని దొడ్లేరు, హసనాబాద్, గుడిపాడు, నాగవరం తదితర గ్రామాల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దొడ్లేరు గ్రామంలోని రెండు చావిళ్లకు చెందిన ముజావర్ల ఆధ్వర్యంలో పాలకేంద్రం వద్ద పీర్ల చావిడిలో స్నానాలు ఆచరించి అగ్ని గుండాలలో నడిచారు. మహిళా భక్తులు ఉపవాసాలు ఉన్నారు. గ్రామంలో తెలుగుదేశం పార్టీ ముస్లిం సోదరుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ వేడుకకు హాజరయ్యారు. పీర్లు పట్టుకుని ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకులు కంచేటి సాయిబాబు, మండల నాయకులు ఉన్నారు.

సత్తెనపల్లి: ఈ నెలలో నెలవంక కనిపించిన మూడో రోజు నుంచి ప్రారంభమైన మొహర్రం ఉత్సవాలు బుధవారం పీర్ల నిమజ్జనంతో ముగిశాయి. ఈ సందర్భంగా పీర్లను విశేషంగా అలంకరించి, ఊరేగించారు. అనంతరం నిమజ్జనం చేశారు. ముస్లిం పెద్దలు మాట్లాడుతూ ప్రజలంతా సోదర భావంతో మెలుగుతూ సుఖ శాంతులతో ఉండాలని ఆకాంక్షించారు.



బెల్లంకొండలో పీర్లను ఊరేగిస్తున్న యువకులు

నకరికల్లు: త్యాగానికి ప్రతీకగా ముస్లిం సోదరులు పవిత్రంగా జరుపుకొనే మొహర్రం కార్యక్రమాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. గుండ్లపల్లి, చల్లగుండ్ల గ్రామాల్లో పీర్లను ఊరేగించారు. పీర్లను మహిళలు, పురుషులు పెద్దఎత్తున అనుసరించారు. పలువురు ఉపవాస దీక్ష పాటించారు. ఊరేగింపుగా చెరువుకు తరలివెళ్లి జలస్నానం చేయించడంతో మొహర్రం ముగిసింది. అనంతరం ప్రత్యేక ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

ముప్పాళ్ళ: మండలంలోని గ్రామాల్లో ముస్లిం సోదరులు బుధవారం మొహర్రం వేడుకలు నిర్వహించారు. పీర్లను అందంగా అలంకరించి గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. మండల కేంద్రమైన ముప్పాళ్ళ, గోళ్ళపాడు, తొండపి గ్రామాల్లో నిర్వహించిన వేడుకల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

రాజుపాలెం: రెడ్డిగూడెం, గణపవరం, ఇనిమెట్ల, మొక్కపాడు, అనుపాలెం గ్రామాల్లో బుధవారం విశేషంగా అలంకరించిన పీర్లను ప్రత్యేకంగా ఊరేగించారు. పురవీధుల గుండా పీర్లు వెళ్తుంటే మహిళలు, పెద్దలు పరవశించిపోయారు. సమీప గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో కులమతాలకు అతీతంగా ప్రజలు తరలివచ్చి వేడుకల్లో పాల్గొన్నారు.



గుండ్లపల్లిలో పీర్ల ఊరేగింపులో ముస్లింలు



ముప్పాళ్ళలో పీర్ల ఊరేగింపు దృశ్యం




రెడ్డిగూడెం గ్రామంలో పీర్లను ఊరేగిస్తున్న ముస్లిం సోదరులు

వృద్ధాశ్రమంలో అన్నదానం



గురజాల: సీపీఐ నాయకుడు, పత్రికా విలేకరి యేచూరి లక్ష్మీనారాయణ వర్ధంతిని పురస్కరించుకుని వృద్ధాశ్రమంలో బుధవారం అన్నదానం చేశారు. స్థానిక అనిగ్రేస్ వృద్ధాశ్రమంలో లక్ష్మీనారాయణ కుమారుడు మణి ఆధ్వర్యంలో వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. లక్ష్మీనారాయణ పోరాట నాయకుడని వక్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్‌పర్సన్ షేక్ బడేజానీ, ఏపీపీ బండి వీరభద్రుడు, సీపీఐ నాయకుడు షేక్ హుస్సేన్, విలేకరులు నారాయణభట్లు సుబ్రమణ్యం, బి.అలరాజు, నాగులు మీరా, కుటుంబ సభ్యులు తదితరులున్నారు.

వంతెనలు శిథిలం.. ప్రమాదంలో ప్రయాణం!





ప్రమాదకర దుస్థితిలో నందిరాజుపాలెం, చంద్రాజుపాలెంలోని వంతెనలు

బెల్లంకొండ: మండలంలోని పలు గ్రామాల్లో కాలువలు, రహదారులపై ఉన్న వంతెనలు, కల్వర్టులు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రయాణికులు భయపడుతున్నారు. నందిరాజపాలెం, మాచాయపాలెం, చంద్రాజుపాలెం, కందిపాడు గ్రామాల మీదుగా చింతపల్లి మేజరు కాలువ ప్రవహిస్తోంది. దీంతో పలు గ్రామాలకు కాలువపై తొమ్మిది వంతెనలను నిర్మించారు. ఇవి శిథిలావస్థకు చేరాయి. మరీ ముఖ్యంగా చంద్రాజుపాలెం నుంచి బ్రహ్మంగారి మఠం వైపుగా రోడ్డులో కాలువపై నిర్మించిన వంతెన, నాగిరెడ్డిపాలెం - నందిరాజుపాలెం రహదారిపై వంతెన శిథిలావస్థకు చేరి కుంగిపోయేలా ఉన్నాయి. చంద్రాజుపాలెం వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు కూలిపోయాయి. నీళ్ల ప్రవహించే సమయంలో ప్రమాదాలకు గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రయివేటు పాఠశాలల బస్సులు ఇటుగా రాకపోకలు సాగిస్తుంటాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు భయాందోళనలకు గురవుతున్నారు. అధికారులు వెంటనే మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

అనుమానాస్పదంగా యువకుల సంచారం



సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యం

నాదెండ్ల: గణపవరం గ్రామంలోని సినిమాహాల్ రోడ్డులో అర్ధరాత్రి దాటాక 2 గంటల సమయంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇరువురు యువకులను ఎస్సై జె.బలరామ్‌రెడ్డి గమనించి విచారించేందుకు యత్నించగా, వారు పరారయ్యారు. తమ ద్విచక్ర వాహనాన్ని అక్కడే వదిలి తాళంచెవి తీసుకెళ్లారు. దీంతో పోలీసులు ద్విచక్ర వాహనాన్ని సమీపంలోని ఇంట్లో ఉంచి వెళ్లారు. పోలీసులు వెళ్లిన కొద్ది సేపటికే ఇరువురు యువకులు అక్కడి పలు వీధులను వెతికి తమ వాహనాన్ని గుర్తించారు. ద్విచక్ర వాహనం స్టార్ట్ ప్లగ్‌ను పోలీసులు తీసుకెళ్లటంతో వాహనం స్టార్ట్ కాలేదు. దీంతో సమీపంలో ఓ ఇంటి ముందు నిలిపి ఉంచిన మరో ద్విచక్ర వాహనం ప్లగ్‌ను పీకేసి తమ వాహనానికి బిగించుకుని అక్కడి నుంచి పరారయ్యారు. యువకుల వ్యవహారం ఆ వీధిలోని సీసీ కెమెరాలో రికార్డు అయింది. స్థానికులు విషయాన్ని పోలీసులకు సమాచారమిచ్చారు. కొంతకాలంగా గణపవరం గ్రామంలో వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పోలీసులు రాత్రి సమయంలో పహారా నిర్వహించాలని, దొంగతనాలు జరగకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.